
సాక్షి నిర్మల్

మంగళవారం। 21। జనవరి। 2025



కొడుకు చనిపోయాడని..

అనారోగ్యంతో కొడుకు చనిపోయాడని తట్టుకోలేని తండ్రి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాసరలో చోటు చేసుకుంది. 8లో▸



సేంద్రియ సాగుతో లాభాలు

లక్ష్మణచాంద మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రణాళికాబద్ధంగా ఏడాది పొడవునా కూరగాయలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 / 16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రిపూట చలితీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిచేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

కడెం: లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలని మండలంలోని లక్ష్మీపూర్, కల్లెడ గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి మంత్రి కొండా సురేఖను కోరారు. కడెం ప్రాజెక్ట్ దిగువన పాండ్వపూర్ వంతెన వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు గతంలో పలుమార్లు సర్వే నిర్వహించారన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే కడెం, దస్తురాబాద్ మండలాల్లోని నవాబ్‌పేట్, లక్ష్మీపూర్, దోస్తనగర్, కల్లెడ, ఆకొండపేట్ గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. నియోజకవర్గంలో పోడు భూముల సమస్యను పరిష్కరించాలని, దేవాలయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేంకల శ్రీనివాస్ యాదవ్, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రతీ ఇంటికి చేరాలి



మాట్లాడుతున్న అంజికుమార్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరేలా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించారన్నారు. రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, సంవిధాన్ అభియాన్ కార్యక్రమ జిల్లా కన్వీనర్ సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో అర్హులను గుర్తించాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: ప్రభుత్వ పథకాల అమలు కోసం మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో అర్హులను గుర్తించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక రైతు వేదికలో గ్రామసభ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, డీటీ నరేష్‌గౌడ్, ఎంపీవో రహీంఖాన్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో ప్రతిభ



వైష్ణవికి రజత పతకం అందజేస్తున్న సభ్యులు

సోన్: సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గతేడాది అక్టోబర్‌లో కళాశాల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో మండలంలోని కద్తాల్ గ్రామానికి చెందిన జి.వైష్ణవి ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో సత్యసాయి జాతీయ సేవాదళ్ కోఆర్డినేటర్ ఎస్.కోటేశ్వరరావు, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హెచ్‌జి దొర, తెలంగాణ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట్రావు చేతుల మీదుగా పతకం అందుకున్నట్లు సోమవారం ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

భూసర్వేతోనే సరి..!

- జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు ఊసేలేని వైనం
- బాసరలో ప్రభుత్వ భూములున్నా ఫలితం శూన్యం
- ఎనిమిదేళ్లుగా జిల్లా వాసుల ఎదురుచూపులు



బాసర మండలంలోని ప్రభుత్వ భూములు

భైంసా: జిల్లాలోని బాసర మండలంలో ప్రభుత్వానికి సంబంధించిన 800 ఎకరాలకు పైగా భూములు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. 2020లో అప్పటి జిల్లా యంత్రాంగం పరిశ్రమల శాఖ సంయుక్తంగా సర్వే నిర్వహించింది. బాసర ప్రాంతంలో ఎస్‌ఈజడ్(సెజ్–స్పెషల్ ఎకనామిక్ జోన్) ఏర్పాటుపై ప్రభుత్వం చర్చించింది. అప్పట్లో ఇక్కడ పలు పరిశ్రమల కోసం దరఖాస్తులు స్వీకరించింది. భూములు కేటాయించి పరిశ్రమలకు అవసరమైన వసతులు కల్పించాలని సంకల్పించింది. ఈ విషయంపై గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు చర్చలు జరిగాయి. అయినా ఇప్పటికీ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై ముందడుగు పడడంలేదు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుతో ఆదాయంతో పాటు ఇక్కడి యువతకు ఉపాధి దొరికే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలి. జిల్లాలో సహజ వనరులు, నీటిసౌకర్యం, రోడ్డు మార్గం ఉన్నా ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను కలిసి ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించడంలేదు.

జిల్లా ఏర్పాటై ఎనిమిదేళ్లయినా..

నిర్మల్ జిల్లా ఏర్పాటుచేసి ఎనిమిదేళ్లవుతోంది. కానీ ఇక్కడ చెప్పుకోదగ్గ పరిశ్రమలైతే లేవు. పారిశ్రామిక అభివృద్ధిలో జిల్లా వెనుకబడి ఉంది. భైంసా పట్టణంలో గతంలో 33కు పైగా పత్తి జిన్నింగు ఫ్యాక్టరీలు ఉండేవి. పత్తి సాగు విస్తీర్ణం తగ్గడంతో ప్రస్తుతం 20 లోపే ఉన్నాయి. మిగిలిన జిన్నింగు ఫ్యాక్టరీలన్నీ మూతపడ్డాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భైంసా జిన్నింగు ఫ్యాక్టరీలకు అడ్డాగా ఉండేది. ప్రతీ సీజన్‌లో 20 వేల మంది కూలీలకు పత్తి సీజన్‌లో భైంసాలో పని దొరికేది. పత్తి సాగు విస్తీర్ణం తగ్గడం, గులాబీరంగు పురుగు ఉధృతితో రైతులు సాగును తగ్గించడంతో ఫ్యాక్టరీలన్నీ మూతపడ్డాయి. ఫ్యాక్టరీల యజమానులు వాటిని ప్లాట్లుగా మార్చి అమ్మేశారు. దీంతో జిల్లాలో చెప్పుకోదగ్గ ఫ్యాక్టరీలున్న భైంసాలోనూ ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి.

సోలార్ ప్లాంట్లు

జిల్లా ఏర్పడ్డాక మూడు సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటయ్యాయి. గత ప్రభుత్వం నిర్మల్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో తేనెశుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసింది. డెయిరీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పాలశీతలీకరణ కేంద్రం ఉంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో సూక్ష్మ చిన్న తరహా అన్నీ కలిపి సుమారు 260 పరిశ్రమలు ఉన్నాయి. కానీ పెద్ద పరిశ్రమలైతే కనిపించడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం పరిశ్రమల ఏర్పాటు విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలి.

పక్క జిల్లాలో....

జిల్లా మీదుగా మహారాష్ట్రను కలుపుతూ జాతీయ రహదారి నంబర్ 44, 61 ఉన్నాయి. మరో జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జాతీయ రహదారులకు నిర్మల్ జిల్లా కేంద్రం కూడలిగా ఉంది. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌వైపు వెళ్లే ఈ మార్గంలో పక్క జిల్లాల్లో ఎన్నో పరిశ్రమలు కనిపిస్తాయి. మేడ్చల్, రామాయణ్‌పేట్, కామారెడ్డి, బిక్కనూర్, ఆర్మూర్ ఇలా హైదరాబాద్ నుంచి వచ్చే ప్రధాన జాతీయ రహదారికి ఆనుకుని పలు రకాల పరిశ్రమలు నిర్మించారు. గోదావరినది దాటగానే నిర్మల్ జిల్లా సరిహద్దు ప్రారంభం అవుతుంది. జిల్లా సరిహద్దులో కొత్త పరిశ్రమలు ఎక్కడా కనిపించవు.

అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ...

నిర్మల్ జిల్లాలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ పరిశ్రమల ఏర్పాటుపై అడుగు ముందుకు పడడంలేదు. పరిశ్రమలకు కావాల్సిన సహజ వనరులు, రవాణా మార్గాలు, అందులో పనిచేసేందుకు కావాల్సిన శ్రామికులు ఇక్కడ ఎంతో మంది ఉన్నారు. కానీ ఇప్పటి వరకు పరిశ్రమలు మాత్రం ఏర్పాటు కావడంలేదు. ఇక నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో సూక్ష్మతరహా పరిశ్రమలే ఉన్నాయి. కానీ ఒక్క పెద్ద పరిశ్రమ కూడా లేదు. బాసరను కలుపుతూ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బాసరలో రైలుమార్గం ఉంది. పక్కనే గోదావరి నది ఉంది. ఈ పరిసరాల్లోనే బాసర మండలంలో ప్రభుత్వ భూములు ఉన్నాయి. అయినప్పటికీ ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు ఎందుకు జరుగడంలేదో తెలియడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రజా ప్రతినిధులు దృష్టి సారిస్తేనే...

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు విషయంలో ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి ఇక్కడి వనరులపై ప్రభుత్వ భూములపై చర్చించాలి. జిల్లాలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే విషయంపై చర్చించాలి. నిర్మల్ జిల్లాలో సోయ పంట అధికంగానే సాగవుతుంది. పండించే పంటలకు సంబంధించిన ఎలాంటి పరిశ్రమలు ఇక్కడ లేవు. పంటలకు అనువుగా ఉండే పరిశ్రమలు ఏర్పాటుచేస్తే రైతులకు ధరలు కలిసివస్తాయి. జిల్లాలో పండించే పంటల ఆధారంగా వాటికి అనుబంధంగా ఉండే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జిల్లా పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన సంక్షేమ పథకాల అమలుకు మంగళవారం నుండి ఈనెల 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో సమయపాలన పాటించాలన్నారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో అర్హుల జాబితాను ప్రచురించాలని, గ్రామసభల్లో వచ్చే అర్జీలను స్వీకరించాలన్నారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీపీవో శ్రీనివాస్, డీఎస్‌వో కిరణ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల భద్రతకు పటిష్టమైన చర్యలు

- ఎస్పీ జానకీ షర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: బ్యాంకులు, ఏటీఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో అన్ని బ్యాంకుల అధికారులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు వారి పరిధిలోని బ్యాంకులను ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. బ్యాంకు పరిసర చెట్టు ప్రాంతాలను, లాకర్లను, వాటి పనితీరును పరిశీలించాలన్నారు. బ్యాంక్ అధికారులు ప్రతీరోజు బ్యాంకు మూసే ముందు లాకర్లు, అలారం సిస్టమ్ సరిగ్గా పని చేస్తుందో లేదో చూసుకోవాలన్నారు. ఏటీఎంల వద్ద అన్ని వైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్ శాఖ అనునిత్యం బ్యాంకర్లకు అందుబాటులో ఉండి భద్రత చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. బ్యాంకుల పరిధిలో ఏమైనా భద్రత సమస్యలు తలెత్తితే పోలీస్ శాఖ వారికి సమాచారం అందించాలన్నారు. అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఉపేంద్రరెడ్డి, రాజేష్ మీనా, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. వెల్డింగ్ వేశారు

సాక్షి స్పందన

'చికిత్సకు వెళ్లి చిక్కుకుంది'శీర్షికన ఆదివారం 'సాక్షి'మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి ముందున్న బెట్ గేట్ వద్ద క్యాటిల్ గార్డుపై సందుల్లో ఇనుప రాడ్లు వేసి వెల్డింగ్ చేయించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



సీఎంఆర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ రైస్‌మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎంఆర్ సరఫరాపై సంబంధిత అధికారులు, రైస్‌మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యం, పూర్తిచేసిన సరఫరా, నిల్వ ఉన్న ధాన్యం, రోజువారీగా తరలిస్తున్న ధాన్యపు లారీల వివరాలను మిల్లర్ల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ సరఫరాలో వేగం పెంచాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు క్షేత్ర స్థాయిలో మిల్లులను తనిఖీ చేసి రోజువారీ నివేదికలను అందజేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం సివిల్ సప్లయ్ వేణుగోపాల్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

'ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ అమలు చేయాలి'



రిలే దీక్షలో పాల్గొన్న ఆర్టిజన్ కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ చేయాలని కోరుతూ విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థలో 18 ఏళ్లకు పైబడి విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారన్నారు. కొంతమంది నిరుద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా 2018 సెప్టెంబర్ 18న 12(3)పారిశ్రామిక వివాదాల చట్టం 1947 ప్రకారం పర్మినెంట్ చేసుకునే వెసులు బాటు కల్పిస్తూ తీర్పు వెలువరించిందన్నారు. ఐదుగురు చేయాల్సిన పనిని ఇద్దరితో చేయిస్తున్నారని వాపోయారు. స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్ ప్రకారం 8 గంటల షిఫ్ట్ డ్యూటీ, వారాంతపు సెలవు, ఓవర్ టైం వేతనం ఇవ్వాలని ఉన్నప్పటికీ ఇవ్వడం లేదన్నారు. దీక్షలో మధు, కృష్ణ, వసీం, అశ్వక్, శ్రీనివాస్, పోశెట్టి, మధు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపు



విద్యార్థులతో లయన్స్ క్లబ్ సభ్యులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ లయన్స్ క్లబ్ సభ్యులు జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌లో గల శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదువుతున్న ఐదుగురు పేద విద్యార్థులకు సోమవారం ఫీజులు చెల్లించారు. ఎల్‌కేజీ చదువుతున్న విగ్నేష్‌కు రూ.5వేలు, తొమ్మిదో తరగతి చదువుతున్న వర్షినికి రూ.6వేలు, ఎల్.ఎస్ శంకర్‌రావు అందజేశారు. ఒకటో తరగతి చదువుతున్న సిద్ధార్థకు రూ.4,500 కంటి వైద్య సహాయక నిపుణులు రవికుమార్‌రెడ్డి, శరణ్యాకు శ్రీనివాస్‌గుప్తా రూ.5వేలు, ఎల్‌కేజీ చదువుతున్న కృతిక్ నందన్‌కు రూ.4,500 శ్రీనివాస్‌యాదవ్ అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానాచార్యులు కట్ట రేఖ వారికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

ఈసారీ 'పది'లమేనా..!

గత రెండు విద్యా సంవత్సరాల పాటు నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలవడంతో ఈయేడు కూడా జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. గత విద్యా సంవత్సరం పదోతరగతి వార్షిక పరీక్షలకు 230 ప్రభుత్వ పాఠశాలల్లోని 8,908 మంది విద్యార్థులు హాజరుకాగా 99.05 శాతంతో 8,823 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 184 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈసారి ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న దాదాపు 6వేలమంది విద్యార్థులతో కలిపి మొత్తం 9,277 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా మొదటి స్థానం పొందేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.

- రెండేళ్లుగా పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానం
- సర్కారు బడుల్లో స్టడీఅవర్స్
- హ్యాట్రిక్ కోసం జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ



ప్రత్యేక స్టడీ అవర్‌లో సన్నద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రెండేళ్లుగా నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానం కైవసం చేసుకుంటోంది. ఈసారీ జిల్లా విద్యాశాఖ రానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే పదో తరగతి పరీక్షల టైం టేబుల్ విడుదలైంది. మార్చి 21 నుంచి పరీక్షలు మొదలు కానున్నాయి. నేటి నుంచి 60 రోజుల సమయం మాత్రమే ఉండటంతో విద్యార్థులు కూడా సమయ సారిణి ప్రకారం పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు.

పూర్తయిన సిలబస్..

జిల్లాలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్, ఆయా గురుకుల సొసైటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలల్లో ఇప్పటికే పదో తరగతి సిలబస్ పూర్తయింది. కొన్ని రోజులుగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు కలిగే సందేహాలు నివృత్తి చేస్తూ పునశ్చరణ కూడా చేస్తున్నారు. ప్రతీ వారం, నెల ఆయా సబ్జెక్టులలో అన్ని పాఠ్యాంశాలపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, గణితం, సాంఘిక తదితర సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేకంగా తయారు చేసిన అభ్యాస కరదీపికలు, మెటీరియల్‌ను కూడా విద్యార్థులకు అందజేశారు. మరికొన్ని పాఠశాలల్లో దాతలు, ఉపాధ్యాయుల చొరవతో స్టడీ మెటీరియల్ సమకూర్చారు..

లక్ష్యం దిశగా ప్రణాళిక...

రెండేళ్లుగా ఫలితాలు ఇచ్చిన ప్రేరణతో ఈ విద్యా సంవత్సరం గత జూన్ నుంచే పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు, విద్యాశాఖ ఉన్నతాధికారులు పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడం, సులభమైన పద్ధతిలో బోధన అభ్యసన ప్రక్రియ కొనసాగేలా పూర్తిస్థాయిలో సంసిద్ధులను చేసేందుకు "లక్ష్య" కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు కరదీపికలు అందజేసింది. వారిలో విషయ నైపుణ్యం మెరుగుపరిచేలా ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చింది. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేందుకు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ప్రత్యేక విధులను కేటాయించారు. నిత్యం వారిని పర్యవేక్షిస్తూ విద్య నైపుణ్యాల పెంపొందించేందుకు మార్గనిర్దేశం చేసేలా కార్యాచరణ చేపట్టారు. వీటికి అదనంగా వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి సందేహాలను తీర్చేలా చర్యలు చేపట్టారు. డీఈవో పి.రామారావు సైతం రోజువారీ పాఠశాలల సందర్శనలతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు తగు మార్గనిర్దేశనం చేస్తున్నారు.

ప్రణాళికతో ముందుకెళ్తున్నాం



పదోతరగతి ఫలితాల్లో గత రెండు విద్యా సంవత్సరాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచాం. ఈ స్థానాన్ని పదిలపరుచుకునే లక్ష్యంతోనే తగిన ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. విద్యార్థులకు పరీక్షలు అంటే భయాందోళనలు తొలగిపోయేలా సన్నద్ధం చేస్తున్నాం. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.
– పి.రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి

'పది' పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల వివరాలు

పాఠశాల	సంఖ్య	బాలురు	బాలికలు	మొత్తం
ప్రభుత్వ, జెడ్పీ	116	2,150	1,704	3,854
ఆశ్రమ, సంక్షేమ గురుకులాలు	32	702	1,015	1,717
కేజీబీవీలు	18	00	715	715
ప్రైవేటు, ఎయిడెడ్	69	1,688	1,303	2,991
మొత్తం	235	4,540	4,737	9,277

టీచర్ల స్పౌజ్ బదిలీలు

నిర్మల్‌రూరల్: ప్రభుత్వం సుదీర్ఘకాలం తర్వాత ఉపాధ్యాయులకు జీవో 317 బదిలీలకు పచ్చ జెండా ఊపింది. ఇందులో భాగంగా అర్హులైన ఉపాధ్యాయుల జాబితాను సోమవారం రాత్రి విడుదల చేసింది. జిల్లా నుండి ఇతర జిల్లాలకు ఒక్కరు బదిలీ కాగా ఇతర జిల్లాల నుండి నిర్మల్‌కు 9 మంది బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు యోగితా రానా ఉత్తర్వులు జారీ చేశారు. 317 జీవోలో భాగంగా ఉపాధ్యాయులు ఇష్టం లేకపోయినా ఇతర జిల్లాలకు మూడేళ్ల క్రితం స్థానికతను వదిలి బదిలీపై వెళ్లారు. కుటుంబాలకు దూరంగా ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన జీవో 317కు వ్యతిరేకంగా పోరాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చి సమస్యలు తీర్చేందుకు ప్రత్యేకంగా క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. పలు దఫాలుగా క్యాబినెట్ సబ్ కమిటీ చర్చించిన అనంతరం మొదటగా 317 స్పౌజ్ ఉపాధ్యాయ బదిలీలకు అనుమతించింది. 15 రోజుల క్రితం దరఖాస్తులు స్వీకరించగా సంక్రాంతి సెలవుల అనంతరం ప్రభుత్వం వారిని బదిలీ చేస్తూ తాజాగా సోమవారం రాత్రి జాబితాను విడుదల చేసింది. వీరు మంగళవారం తమకు కేటాయించిన పాఠశాలలో జాయిన్ కానున్నారు.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



స్వీట్లు తినిపిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: కరీంనగర్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీవరకు 46వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాజట్టు ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించింది. సోమవారం మంచిర్యాలకు వచ్చిన జట్టు సభ్యులకు అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతంపలికి స్వీట్లు తినిపించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, పీడీ రేని రాజయ్య,కోచ్ సునార్కర్ అరవింద్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణపై దాడి చేసిన కేసులో సోమవారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..గతనెల 29వ రాత్రి బెల్లంపల్లి బజారుఏరియా ప్రాంతం యూనియన్ బ్యాంక్ వీధిలో ఓ సెలూన్ షాప్‌నకు ఆదినారాయణ వెళ్లగా కొందరు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదైంది. ఈమేరకు నిందితుల్లో ఇద్దరైన రాగంశెట్టి సతీశ్, పూసాల శ్రీకాంత్‌లను అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు పంపించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నీలుగాయి అప్పగింత



అటవీ అధికారులకు అప్పగిస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామ మాజీ సర్పంచ్ ప్రవీణ్ సోమవారం నీలుగాయిని అటవీ అధికారులకు అప్పగించారు. గ్రామ శివారులోని పంట పొలంలో నీలుగాయి కనిపించడంతో మాజీ సర్పంచ్.. అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని నీలుగాయిని నిర్మల్ అటవీశాఖ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ ఎఫ్ఆర్ఓ అనిత, డిప్యూటీ రేంజ్ అధికారి ఇర్ఫానొద్దీన్, ఎఫ్ఎస్ఓ హర్ష ద్‌రాజా, బీట్ ఆఫీసర్ అలీం తదితరులు ఉన్నారు.

'వసంత పంచమి'కి రావాలని ఆహ్వానం

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో వచ్చేనెల 1 నుంచి 3వ తేదీ వరకు వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు రావాలని ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు సోమవారం ఆలయ అధికారులు ఆహ్వానపత్రికను అందించారు. ఆలయ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

మిట్టపల్లి..ఉద్యోగాల కల్పవల్లి

- ఒకే ఊరిలో 50 మందికిపైగా ప్రభుత్వ కొలువులు
- పోలీసులు, సింగరేణి, కార్యదర్శులు ఇలా అనేకం
- వీరంతా సింగరేణి కార్మికుల పిల్లలు
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



అప్పటి ఉపాధ్యాయులు వెంకటస్వామి, రాంచందర్



లిటిల్ స్టార్ కాన్వెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

జైపూర్: మండలంలోని మిట్టపల్లి మారుమూల గ్రామం. ఇక్కడి ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఇక్కడ సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్ బాగుపడుతుందని పెద్దలు తలచారు. స్థానిక యువత మొక్కవోని దీక్షతో ఉజ్వల భవిష్యత్‌పై ఆశతో ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు సాగించారు. ఊరిలో దాదాపు 50 మందికి పైగా వివిధ ప్రభుత్వ కొలువులు సాధించారు. వీరంతా సింగరేణి కార్మికుల పిల్లలు కావడం విశేషం. పోలీసులు, సింగరేణి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ కానిస్టేబుల్, ట్రాన్స్‌కో ఏఈ, లైన్‌మెన్‌గా ఇలా అనేక ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు చిరునామాగా ఈ గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది.

అక్షరాలు నేర్పింది ఆ పాఠశాలనే..

మిట్టపల్లిలో 1994లో ప్రారంభమైన లిటిల్ స్టార్ కాన్వెంట్(శ్రీనివాస) హైస్కూల్ ఎంతో మంది విద్యార్థులకు అక్షరాలు నేర్పింది. టీకుమట్ల గ్రామానికి చెందిన అన్నతమ్ముళ్లు సంబోదుల వెంకటస్వామి, రాంచందర్ ఉపాధ్యాయులు వారికి 7వ తరగతి వరకు విద్య బోధించారు. వారంతా ప్రస్తుతం ప్రభుత్వ కొలువులు కొట్టారు. నేడు ఉన్నతస్థానానికి చేరుకున్నారు. కాగా, కాలక్రమేణా 2002లో ఆ పాఠశాల మూతబడింది.

సైకిళ్లపై 5 కి.మీ, వచ్చి..

గ్రామంలో ఉన్నత విద్యకోసం విద్యార్థులు మండల కేంద్రానికి వచ్చేవారు. సైకిళ్లపై 5 కి.మీ దూరం వచ్చి వెళ్తుండేవారు. గురుకులం, జెడ్పీ, ప్రైవేట్ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుకున్నారు. పోటీ పరీక్షల్లో సత్తాచాటి ప్రభుత్వ కొలువులు సాధించారు.

పోలీస్ బ్రదర్స్



రాజ్‌కుమార్, ఎస్సై



రవికుమార్, ఎస్సై

గోదారి అమృత-లచ్చయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. ఇద్దరు కూతుళ్లు. లచ్చయ్య సింగరేణి ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాడు. పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ 2014లో ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అన్నను ఆదర్శంగా తీసుకున్న తమ్ముడు రవికుమార్ పట్టుదలతో చదివి 2020లో ఎస్సై ఉద్యోగం సాధించాడు. రాజ్‌కుమార్ హన్మకొండలో విధులు నిర్వర్తిస్తుండగా, రవికుమార్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పని చేస్తున్నాడు. ఈ బ్రదర్స్ ఒకే స్కూల్‌లో చదివి పట్టుదలతో పోలీసుశాఖలో ఉద్యోగాలు సాధించారు.

అన్నాచెల్లెళ్ల ఇద్దరికీ కొలువులే

ఒకే పాఠశాలలో చదివిన తాము అన్నాచెల్లెళ్లు. అన్నగా తాను సింగరేణిలో క్లర్క్ ఉద్యోగం సాధించాను. నా చెల్లి పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైంది. నేను ఎస్టీపీపీలో విధులు నిర్వర్తిస్తుండగా చెల్లెలు చెన్నూర్ మండలంలో కార్యదర్శిగా పనిచేస్తోంది.



దూట రాజమల్లు, సింగరేణి క్లర్క్



శ్రీలక్ష్మి, గ్రామ కార్యదర్శి

డిప్యూటీ కలెక్టర్ కావడమే లక్ష్యం

వరుసగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్‌బీఐలో పనిచేస్తూనే సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఉన్నతస్థానంలో ఉండాలని మళ్లీ చదివి అటవీశాఖలో (ఎఫ్ఆర్‌వో) ఉద్యోగం సాధించాను. భూపాలపల్లి జిల్లా ములుగులో విధులు నిర్వర్తిస్తున్నాను. డిప్యూటీ కలెక్టర్ కావడమే లక్ష్యంగా ఇటీవల గ్రూప్-1 పరీక్ష రాశాను. - శ్రీరామ్‌కుమార్, రేంజ్ అధికారి



పట్టుదలతో చదివాను

తాను పోలీస్ ఉద్యోగం సాధించాలని కలలుగన్నా. కష్టపడి చదివి 2019లో ఎస్సై ఉద్యోగం సాధించాను. ఇప్పుడు నిజామాబాద్ జిల్లా దర్పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్నాను. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. - రామకృష్ణ, ఎస్సై



78 కిలోల గంజాయి దహనం



ఎలక్ట్రిక్ యంత్రంలో దహనం చేస్తున్న దృశ్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో నమోదైన 26 కేసుల్లో పట్టుబడ్డ 78 కిలోల 295 గ్రాముల గంజాయిని పోలీసులు సోమవారం దహనం చేశారు. గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌కు తరలించిన పోలీసులు అక్కడి ఎలక్ట్రిక్ యంత్రంలో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీసీఆర్బీ డీఎస్పీ సీహెచ్.నాగేందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.పాండేరావు, డీసీఆర్‌బీ ఎస్సై హకీమ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా రాధిక



బాధ్యతలు స్వీకరిస్తున్న రాధిక

మంచిర్యాల టౌన్: ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా మంచిర్యాలకు చెందిన గైనకాలజిస్టు వైద్యురాలు రాధిక నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాకు గత మూడేళ్లుగా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ లేకపోవడంతో ఉమ్మడి జిల్లా మేనేజర్ సత్యనారాయణ అదనపు బాధ్యతలను ఇన్నాళ్లుగా నిర్వర్తించారు.

ఆర్జీయూకేటీ బలోపేతానికి చర్యలు

- ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీ బలోపేతానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. సోమవారం బాసర పరిపాలన భవనంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో ఓఎస్డీ మురళీదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో సెమిస్టర్ ప్రారంభమవుతున్న సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలు, నిర్వర్తించాల్సిన విధులు, అకాడమిక్స్, సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ, ఇంటెన్షిప్, లైబ్రరీ బలోపేతం, పీయూసీ విద్యార్థులకు కంప్యూటర్‌ల్యాబ్ ఏర్పాటు, ఇంజనీరింగ్ విద్యార్థులకు గేట్ తరగతుల నిర్వహణ, టెక్‌ఫెస్ట్, కల్చరల్‌ఫెస్ట్,స్పోర్ట్స్ డే, తదితర కార్యక్రమాలను మార్చిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ విభాగం నుంచి బడ్జెట్ ప్రపోజల్‌ను అందించాలని సూచించారు.

జిన్నింగ్‌మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- జైనూర్‌లో ఘటన
- వేల క్వింటాళ్ల పత్తి దగ్ధం
- రూ.కోటికి పైగా నష్టం!



కాలిపోతున్న పత్తి కుప్పలు

జైనూర్: మండల కేంద్రంలోని సగ్రాస్ జిన్నింగ్ మిల్లులో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి విక్రయించేందుకు వచ్చిన ఐచర్ వాహనంలో పత్తిని అన్‌లోడ్ చేసే క్రమంలో సైలెన్సర్ నుంచి వెలువడిన నిప్పురవ్వలు పత్తికి అంటుకుని మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలో వ్యాపించడంతో పత్తి నిల్వలు భారీగా దగ్ధమయ్యాయి. నిర్వాహకులు మంటలార్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా రావడంతో అప్పటికే వేల క్వింటాళ్ల పత్తి అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో రూ.కోటి పైగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, నాయకులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దట్టమైన పొగ మంటలు చెలరేగడంతో ప్రజలు జిన్నింగ్ మిల్లు వద్ద భారీగా గుమిగూడారు. కాగా, ప్రమాద నష్టంపై పంచనామా నిర్వహించి వివరాలు వెల్లడిస్తామని అధికారులు, నిర్వాహకులు తెలిపారు.

పత్తి పంటకు నిప్పు

భీమిని: మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధి మెత్తం గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు పత్తికి నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులో రైతు గుర్ల పోశన్న తన పత్తి చేను వద్ద సుమారు 50 క్వింటాళ్ల పంట నిల్వ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం ఉదయం పత్తికి నిప్పు పెట్టారు. చుట్టుపక్కల రైతులు గమనించి బాధిత రైతుకు సమాచారం అందించారు. గ్రామస్తులు, రైతులు నీటితో మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు 5 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. తనకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు వారిని వేడుకున్నారు.



కాలిన పత్తిని చూపుతున్న బాధిత రైతు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు..

కైలాస్‌నగర్: పట్టణంలోని మహాలక్ష్మివాడకాలనీలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. యజమాని కవిత పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న బాధితురాలు కాలిపోయిన వస్తువులను చూస్తు రోధించింది. ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

టిఫిన్ సెంటర్ వాహనం..



దగ్ధమవుతున్న వాహనం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాగులవాడకాలనీలో టిఫిన్ సెంటర్ వాహనం దగ్ధమైంది. కాలనీలో అద్దెకు ఉంటున్న నరేశ్ ఆదివారం ఇంటి ఎదుట వాహనం నిలిపి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో వాహనంలోని బ్యాటరీ నుంచి ఒక్కసారి మంటలు చెలరేగాయి. గమనించిన కాలనీవాసులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- మాలేపూర్ ఘాట్ వద్ద ప్రమాద ఘటన
- డ్రైవర్ నిర్లక్ష్యమేనని పోలీసుల నిర్ధారణ
- కేసు నమోదు, అరెస్టు
- ఇప్పటివరకు ఇద్దరి మృతి
- క్షతగాత్రులకు రిమ్స్‌లో చికిత్స

విచారణ కొనసాగుతుంది..



మాలేపూర్ ఘాట్ సెక్షన్ వద్ద జరిగిన ప్రమాదానికి సంబంధించి విచారణ కొనసాగుతుంది. డ్రైవర్‌ను అరెస్ట్ చేశాం. 35 మంది క్షతగాత్రులు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. - కాజల్, ఉట్నూర్ ఏఎస్పీ

సాక్షి,ఆదిలాబాద్: నార్నూర్ మండలం మాలేపూర్ శివారులో ఘాట్ సెక్షన్ వద్ద ఆదివారం ఐచర్ బోల్తా పడిన ఘటనలో విచారణ కొనసాగుతుందని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ తెలిపారు. గుడిహత్నూర్ మండలం పూనగూడ తోషం గ్రామానికి చెందిన డ్రైవర్ కనక శ్రీరామ్ (26) డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాన్ని నడిపినట్టు గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారిస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్‌పై నార్నూర్‌లో కేసు నమోదు చేశారు. అరెస్టు చేశారు.

క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స..

గుడిహత్నూర్ మండలం సూర్యగూడ, ఇంద్రవెల్లి మండలంలోని సాలెవాడకు చెందిన ఆదివాసీలు జంగుబాయిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం ఐచర్ వాహనంలో బయల్దేరారు. కాప్లే జంగుబాయి వద్ద పుణ్యస్నానాలు, దర్శనం కోసం వెళ్లారు. ఈక్రమంలో సాయంత్రం మాలేపూర్ ఘాట్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ నిర్లక్ష్యం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి



తొడసం నాగుబాయి (ఫైల్)

ఇంద్రవెల్లి: నార్నూర్ మండలంలోని మాలేపూర్ ఘాట్ వద్ద ఐచర్ బోల్తాపడిన ఘటనలో తీవ్ర గాయలైన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంద్రవెల్లి మండలంలోని సాలేగూడకు చెందిన తొడసం నాగుబాయి(70) గుడిహత్నూర్ మండలం సూర్యగూడలోని బంధువులతో కలిసి జంగుబాయి దేవత ఉత్సవాలకు ఐచర్ వాహనంలో వెళ్తోంది. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఆమె మృతితో సాలేగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి కుమారులు సుదర్శన్, మనోహర్ ఉన్నారు.

అనారోగ్యంతో కొడుకు చనిపోయాడని..

- గోదావరిలో దూకి తండ్రి ఆత్మహత్య
- బాసరలో ఘటన



శివరాం మృతదేహం

బాసర: అనారోగ్యంతో కొడుకు చనిపోయాడని తట్టుకోలేని తండ్రి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బాసరలో చోటుచేసుకుంది. ఎస్సై గణేశ్ కథనం ప్రకారం..నిజామాబాద్ జిల్లా జాన్కంపేట్ గ్రామానికి చెందిన శివరాం (62)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తండ్రి శివరాం దిగులుగా ఉంటున్నాడు. అనారోగ్యంతో కొడుకు మృతితో మనోవేదనకు గురయ్యాడు. సోమవారం బాసరకు చేరుకుని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. పెద్దకుమారుడు సతీశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: షెడ్యూల్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించి ఆదివాసీలతో భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో జీవో నంబర్ 3తో పాటు గిరిజన సంక్షేమ శాఖ జీవో నంబర్ 29లతో కలిపి ఆదివాసీలకు వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఎల్టీఆర్ 1/59, 1/70, ఆర్వోఎఫ్ఆర్, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోడు రైతులకు పట్టాలివ్వాలన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

చెన్నూర్‌రూరల్: మండలంలోని పోన్నారం సమీపంలో ముందస్తు సమాచారంతో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం కోడిపందేల స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో మూడు పందెం కోళ్లు, మూడు సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, 9 బైక్‌లతోపాటు రూ.2630 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇద్దరిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మేకలను కట్టేయవద్దన్నందుకు గొడ్డలితో దాడి



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

రెబ్బెన: దారిలో మేకలను కట్టేయవద్దన్నందుకు ఒకరిపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. మండలంలోని కొండపల్లిలో ఈ ఘటన చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సునార్కర్ శంకర్ ఇంటి వెనకాల చునార్కర్ తుకారాం ఇల్లు ఉంది. శంకర్ ఇంటి పక్కనుంచి దారిలో వెళ్లాలి. గత కొంతకాలంగా ఆ దారిలో తుకారాం..మేకలను కట్టేస్తున్నాడు. గత 20 రోజుల క్రితం శంకర్ తన ఇంటికి కొత్త రంగులు వేశాడు. అక్కడ మేకలు కట్టేయడంతో గోడలపై బురదపడుతుంది. ఈ విషయమై ఆదివారం సాయంత్రం మేకలు ఇంటికి వచ్చే సమయంలో వాటిని ఇంట్లో కట్టేసుకోవాలని శంకర్ కోరగా, తుకారం ఆగ్రహించాడు. దుర్భాషలాడుతూ గొడ్డలితో శంకర్‌పై దాడి చేశాడు. తీవ్ర గాయాలైన అతన్ని కుటుంబీకులు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య కమల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి సోమవారం విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఘటన స్థలానికి వెళ్లి దాడికి గల కారణాలను ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు.

శ్రమదోపిడీని ఉపసంహరించుకోవాలి

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



సత్తయ్యకు మెమోరాండం సమర్పిస్తున్న కార్మికులు

నస్పూర్: సింగరేణి కార్మికుల వేతన శ్రమదోపిడీని యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీరాంపూర్ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గనుల్లో జనరల్ మజ్దూర్ ఖాళీల భర్తీకి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. దీనిప్రకారం కార్మికులకు వేజ్ ప్రొటెక్షన్ కల్పించాల్సిన యాజమాన్యం కార్మికుల మూల వేతనం నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు మినహాయించుకుని వారిని ఆర్థిక దోపిడీకి గురిచేస్తోందన్నారు. అనంతరం పలువురు కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ సత్తయ్యకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి రాజేందర్, శ్రీకాంత్, శంకర్, కిశోర్, రవీందర్, సత్యనారాయణ, రామస్వామి, రాజయ్య, శ్రీనివాస్, వేణు, తిరుపతి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.